క్లుప్తంగా

ఉత్సాహంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరం


అక్కిరెడ్డిపాలెం మైదానంలో ఆడుతున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డి పాలెంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అక్కిరెడ్డిపాలెంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు అందజేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్ క్రీడలకు సుమారు 150 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అక్కిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు. ఈ నెల 31వరకు శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

ఘనంగా అంజన్న ఆలయ వార్షికోత్సవం


భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న శ్రీనివాసరావు దంపతులు

కూర్మన్నపాలెం: అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని కోరారు. అనంతరం భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకురాలు కోమటి రమాదేవి, ఆలయ కమిటీ ప్రతినిధులు జి.రామకృష్ణ,నాగేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, శ్రీనివాస్, దానబాల రమణ, రంగారావు, కాలనీ వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరమరణం పొందిన జవాన్‌కు ఘన నివాళి


వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు అగనంపూడి సీడబ్ల్యూసీలో ఘన నివాళులర్పించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో శనివారం నిర్వహించిన సంతాప సభలో సీడబ్ల్యూసీ మాజీ కార్యదర్శి నెల్లి కృష్ణారావు, బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశం కోసం వీర మరణం పొందిన మురళీ నాయక్ జాతి గర్వించదగిన సైనికుడన్నారు. పాకిస్తాన్ దాడికి ఎదురొడ్డి నిలబడిన నాయక్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కరణం పైడిరాజు, విందుల రాజు పాల్గొన్నారు.

పరిశుభ్రత సామాజిక బాధ్యత


శ్రమదానం చేస్తున్న సీఐ పార్థసారథి, బీజేపీ నాయకులు

గాజువాక: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గాజువాక బీజేపీ నాయకులు శనివారం శ్రమదానం చేశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమాన్ని సీఐ పార్థసారథి ప్రారంభించారు. కార్యక్రమంలో గాజువాక ఎస్ఐ నజీర్, బీజేపీ నాయకులు బాటా శ్రీను, శంకరరావు, ఎల్లాజీరావు, రోహిణి, అనిత తదితరులు పాల్గొన్నారు.


సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసి పూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవకు రూ.1,000 చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు.

మధుర జ్ఞాపకాలు

వేసవి సెలవులు వస్తే పల్లెల్లోనే.. అంతా అమ్మమ్మ- తాతయ్య ఇళ్లకే.. చిన్ననాటిజ్ఞాపకాల్లోకి ప్రముఖులు

సమ్మర్ స్పెషల్



ఒకప్పుడు వేసవి సెలవులు వచ్చాయంటే పట్టణాల్లోని విద్యార్థులంతా పల్లెబాట పట్టేవారు. అమ్మమ్మ- తాతయ్య ఇంట్లో సందడి చేసేవారు. ఊరిలో చిన్నారులతో కలిసి ఆటపాటలతో ఉత్సాహంగా గడిపేవారు. కొత్త నైపుణ్యాలు, కొత్త విషయాలు నేర్చుకునేవారు. ఆధునిక ప్రపంచంలో ఆ సందడి కరువైందని నాటి విద్యార్థులు.. ప్రస్తుతం వివిధ హోదాల్లో స్థిరపడిన ప్రముఖులు చెబుతున్నారు. తమ బాల్యంలో చేసిన సందడిని, తమ మధురజ్ఞాపకాలను ఉన్నత స్థానాల్లో స్థిరపడిన అధికారులు 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు. -గాజువాక



అమ్మమ్మగారి ఊరే మా డెస్టినేషన్

మా నాన్న అప్పల నర్సింహం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి కావడంతో మేము పార్వతీపురం, విజయనగరం ప్రాంతాల్లో ఉండేవాళ్లం. వేసవి వచ్చిందంటే మాకు పండగ వచ్చినంత ఆనందంగా ఉండేది. పదో తరగతి వరకు ప్రతి వేసవిలో అనకాపల్లి దగ్గరలోని సిరసపల్లిలో మా అమ్మమ్మవాళ్ల ఇంటికి వచ్చేవాడిని. మా బంధువుల పిల్లలు కూడా అదే సమయంలో వచ్చేవారు. మేమంతా సెలవులను చాలా బాగా ఎంజాయ్ చేసేవాళ్లం. నూతిలో ఈతలు, కర్ర-బిళ్ల, కబడ్డీ, వాలీబాల్ వంటి ఆటలతో రోజంతా బిజీగా గడిపేవాళ్లం. తాటి ముంజెలు లెక్కలేనన్ని తినేవాళ్లం. మా మేనమామలు ముంజెలు కొట్టి ఇచ్చేవారు. సెలవులు వస్తే మాకు అమ్మమ్మవాళ్ల ఊరే డెస్టినేషన్. రోజంతా ఊళ్లో తిరిగి సాయంత్రానికి ఇంటికి చేరేవాళ్లం. వేడినీటిలో పసుపు వేసి ఆ నీళ్ల స్నానం చేయించేవారు. ఇలాంటి సరదాలు పదో తరగతి వరకు బాగా ఎంజాయ్ చేశాను. ఆ రోజులు మళ్లీరావు. ఇప్పటి జనరేషన్‌కు సెలవులను ఎంజాయ్ చేసే అవకాశమే లేదు. అప్పట్లో ఔట్‌డోర్ ఆటలుండేవి. ఇప్పుడు సెల్‌ఫోన్ ఉంటే సరిపోతోంది. పిల్లలను ఏసీ రూముల్లో పెంచుతున్నాం. శారీరక శ్రమ తగ్గింది. ఇమ్యూనిటీ పవర్ కూడా తగ్గిపోయింది.



– బి.ఆర్.ఎస్.శేషాద్రి, జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్.

మామిడి కాయల కోసం చెట్ల వద్దే కాపలా..

నా బాల్యం పార్వతీపురం, బొబ్బిలిలో గడిచింది. వేసవి సెలవులు వచ్చాయంటే బయటే తిరిగేవాళ్లం. మా ఊరికి రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క గ్రామాలకు కూడా వెళ్లి స్నేహితులతో ఆడుకొనేవాళ్లం. ఎండలో తిరుగుతున్నామన్న ఆలోచన వచ్చేదికాదు. పెద్దలు మందలిస్తే తప్ప ఇంటికి వచ్చేవాళ్లం కాదు. అప్పుడు కూడా భోజనం చేసి మళ్లీ వెళ్లిపోయేవాళ్లం. మామిడి కాయల కోసం చెట్లవద్దే కాపలా ఉండేవాళ్లం. తోటలో కాపలాదారులకు తెలియకుండా కాయలు కోసుకొని పరుగులు తీసేవాళ్లం. ఐస్ బండి కోసం ఎదురు చూసేవాళ్లం. పావలా నుంచి రూపాయివరకు ఐస్ ఖరీదు ఉండేది. అందులో పెప్సీ ఐస్‌ను భలే ఇష్టంగా తినేవాళ్లం. స్నేహితులతో బాగా ఆడుకొనేవాళ్లం. గోలీలు, అష్టాచమ్మా, బిళ్లాటలు, కబడ్డీ వంటి అన్ని రకాల ఆటలు ఆడేవాళ్లం. సెలవుల్లో కూడా స్నేహితులను మిస్ అయ్యేవాళ్లం కాదు. వాళ్లతో ఆడుకొంటుంటే పొద్దు తెలిసేదికాదు. నేను హిందీ మొత్తం సెలవుల్లోనే నేర్చుకున్నాను. ఆరో తరగతికి వచ్చేసరికి నేను మాధ్యమిక వరకు నేర్చుకున్నాను. ఆరోజుల్లో మంచపల్లి శ్రీరామ్మూర్తి మాస్టారు హిందీ ఉచితంగా నేర్పేవారు. మాకు సెలవులు చాలా సరదాగా గడిచిపోయేవి. ఇప్పుడున్న పిల్లలకు ఆటలంటే సెల్‌ఫోన్లే. ప్రస్తుత జనరేషన్‌కు మాకు ఉన్న జ్ఞాపకాలు ఉండవు.



– తోట శ్రీవల్లి, గాజువాక తహసీల్దార్.

రోజంతా ఈత కొట్టేవాళ్లం..

మాది శ్రీకాకుళం జిల్లా పాలకొండ గ్రామం. ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే సాగింది. వేసవి సెలవులు వస్తే మాకు దగ్గర్లోనే తలవరం గ్రామంలోని అమ్మమ్మవాళ్ల ఇంటికి వెళ్లేవాడిని. ఆ గ్రామంలో మా బంధువులతో పాటు నాస్నేహితులు ఉండేవారు. సెలవు రోజుల్లో వారితో చాలా సరదాగా గడిపేవాడిని. చెరువులో రోజంతా ఈత కొట్టేవాళ్లం. ఈతకు వెళ్తే ఇల్లు కూడా గుర్తుకొచ్చేది కాదు. అంత ఇష్టంగా ఈదేవాళ్లం. చాలా రకాల ఆటలు ఆడినా గాని కబడ్డీకి మాత్రం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాళ్లం. ఆటల మధ్యలో తాటి ముంజెల కోసం వెళ్లేవాళ్లం. అన్నం కంటే తాటి ముంజెలే ఎక్కువగా తినేవాళ్లం. ఊరికి దగ్గర్లో ఉన్న మామిడితోటకు వెళ్లి ఎవరికీ కనపడకుండా మామిడికాయలు కోసుకొనేవాళ్లం. మామిడికాయలు కోసుకొని పెరిగెత్తి వచ్చేయడం ఒక సరదాగా ఉండేది. నేను సెలవులకు వస్తానని తెలిసిన వెంటనే అమ్మమ్మ నా కోసం పిండివంటలు చేసి పెట్టేది. అమ్మమ్మ చేసిపెట్టే పిండివంటలు జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేను. తాత కూడా పొలం నుంచి వేరుశనగ కాయలు తెచ్చి ఉంచేవారు. ఆ రోజులు గుర్తొస్తే నన్ను నేనే మైమరిచిపోతాను. ఇప్పటి జనరేషన్‌కు ఇలాంటి అనుభవాలు దాదాపు లేవనే చెప్పాలి. తల్లిదండ్రులు ఈ సెలవులను పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానం పంచే విధంగా ప్లాన్‌చేస్తే బాగుంటుంది.



–టి.త్రినాథ్, సౌత్ ఏసీపీ, గాజువాక



వీఆర్ఎస్ కార్మికుల బకాయిలు చెల్లించాలి


ధర్నాలో గంగవరం పోర్టు వీఆర్ఎస్ కార్మికులు


గంగవరం పోర్టు వీఆర్ఎస్ కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- గంగవరం పోర్టు వీఆర్ఎస్ కార్మికుల ఆందోళనకు మద్దతు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వీఆర్ఎస్ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి కోరారు. బకాయిల కోసం గంగవరం పోర్టు కార్మికులు శనివారం పోర్టు ముట్టడికి ప్రయత్నించారు. వెంటనే హార్బర్ ఏసీపీ కాళిదాసు, సీఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో న్యూపోర్టు పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల ఆందోళనకు దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు.యాజమాన్యం స్పందించి కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ నెల 20న చర్చిస్తామని యాజమాన్యంతో చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీను పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


సీనియర్‌మేనేజర్ నాగరాజును సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: ఖాతాదారుల సహకారం, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తుండడం సంతోషంగా ఉందని అగనంపూడి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ బి.నాగరాజు అన్నారు. పదోన్నతిపై విజయనగరం బదిలీపై వెళ్తున్న నాగరాజును శనివారం ప్రజా సంఘాలు, ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, చందు మాట్లాడుతూ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి స్థానిక ప్రజల మన్ననలు పొందడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.సింహాచలం, ఈ.తాతారావు, చంటి, సిబ్బంది ములరాజు, రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, జానకి పాల్గొన్నారు.

హక్కుల రక్షణకే సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కునగరం: కార్మికుల హక్కుల రక్షణ కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం నిర్వహించిన సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో రూ. 1594 కోట్లు రావాల్సి ఉందన్నారు. వీటిని మూడు విడతలుగా చెల్లిస్తారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గత నెల రూ. 72 కోట్లు లాభం వచ్చిందన్నారు. గతంలో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి బాగుంటే కార్మికులకు పూర్తి జీతాలు చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం నేడు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి రాకముందే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం వాటిని ఇక్కడ అమలు చేస్తుందన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ పూర్తి రామెటీరియల్ సమకూర్చిన తర్వాతే బీఎఫ్-3 ప్రారంభిస్తానని స్టీల్ కార్యదర్శి చెప్పారన్నారు. జూన్ నెలాఖరు వరకు రా మెటీరియల్ అందుబాటులో ఉండదని చెబుతున్న యాజమాన్యం జూన్ 10నే బీఎఫ్-3 ప్రారంభించడమేంటని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకే సమ్మెలో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. సమావేశంలో నాయకులు పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, టి.వి. రాజు, మరిడయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో నిఘా కట్టుదిట్టం


స్టీల్‌ప్లాంట్ గేటు వద్ద సీఐఎస్ఎఫ్ తనిఖీలు

ఉక్కునగరం: ఆపరేషన్స్ సిందూర్ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌లో నిఘా కట్టుదిట్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీఐఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ దేశంలోని అన్ని యూనిట్లకు భద్రతకు సంబంధించి వివిధ చర్యలకు ఆదేశించింది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ప్రారంభించారు. విధులకు వెళ్లే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులతో పాటు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సీఐఎస్ఎఫ్‌కు సహకరించాలని యూనిట్ కమాండెంట్ కోరారు.

పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో భాస్కరరావుకు పతకాలు


పతకాలు సాధించిన భాస్కరరావు

పెదగంట్యాడ: కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో ఇటీవల నిర్వహించిన పాన్ ఇండియా మాస్టర్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి భాస్కరరావు పతకాల పంట పండించారు. పవర్ లిఫ్టింగ్‌లో నాలుగు బంగారు పతకాలు, వెయిట్ లిఫ్టింగ్‌లో మూడు రజత పతకాలు సాధించారు. అలాగే అక్టోబర్‌లో బెంగళూరులో నిర్వహించనున్న ఆసియా పోటీలకు భాస్కరరావు అర్హత సాధించారు.

వీర జవాన్‌కు నివాళిగా రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులు

గాజువాక: దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్ మురళీ నాయక్‌కు నివాళిగా మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వందేభారత్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో పాతగాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో 35 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని వీరమరణం చెందిన మురళీ నాయక్‌కు అంకితం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు, ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీను, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు, ప్రతినిధులు పల్లా త్రినాథ్, కరణం బాబూరావు, చైతన్య, గంధం సాయి, డిల్లీశ్వరరావు, సేనాపతి శ్రీను, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాలకు అభినందలు

అగనంపూడి: పహల్గాం ఉగ్రదాడులను ఎదుర్కోవడంతోపాటు పాకిస్తాన్ ఆగడాలను అరికట్టేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేయడంలో భారత సాయుధ దళాలు చూపించిన పౌరవ అభినందనీయమని బీఎంఎస్ కేంద్రీయ సాధన సమితి సమావేశం తీర్మానించిందని రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి మోటూరి సన్యాసినాయుడు, జాతీయ ఉపాధ్యక్షుడు మళ్ల జగదీష్ పేర్కొన్నారు. బీఎంఎస్ వాటి అనుబంధ సంఘాలు సమ్మెలు, ఆందోళనలు తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కేంద్ర సంస్థల విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు సహకారం అందివ్వాలని వారు కోరారు.

వృద్ధుడి అదృశ్యం


కాసులు (ఫైల్)

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరానికి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి. పెదగంట్యాడ మండలం సీతానగరానికి కాకినాడ కాసులు అలియాస్ కాశి (60) ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అతని భార్య కాకినాడ ఆదిలక్ష్మి న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాహం తీర్చని జీవీఎంసీ చలివేంద్రాలు!

- ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



కూర్మన్నపాలెంలో ఖాళీగా చలివేంద్రం


ప్రైవేటు చలివేంద్రం పక్కన జీవీఎంసీ కేంద్రం

కూర్మన్నపాలెం: వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని మహావిశాఖ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎవరికీ ఉపయోగం లేకుండా పోతున్నాయి. మండుతున్న ఎండల్లో తమ సొంతపనుల మీద తిరిగే ప్రజల దాహార్తిని తీర్చడంకోసం జీవీఎంసీ ముఖ్యకూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అంతవరకూ బాగానే ఉన్నా అవి ఏర్పాటు చేసిన స్థలాలు అధ్వానంగా ఉన్నాయి. తాగునీరు దొరకని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే ప్రజలకు ఆశించిన రీతిలో ఉపయోగపడే అవకాశం ఉంది. అధికారుల అనాలోచిత నిర్ణయాలు కాంట్రాక్టర్‌కు మేలు చేసే విధంగా ఉన్నాయి.

వృథాయేనా

చలివేంద్రాల నిర్వహణకు లక్షలాది రూపాయలు వినియోగిస్తున్నామని చెబుతోంది. అయితే వాటి నిర్వాహణపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల మేరకు చలివేంద్రాలల్లో చల్లటి నీరు పెట్టి ప్రజలకు అందించేందుకు ఒక మనిషిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఆ దగ్గరలో ప్రైవేటు చలివేంద్రం లేకుండా ఉంటే జీవీఎంసీ ఏర్పాటు చేసిన కేంద్రాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. కూర్మన్నపాలెంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో రెండు కడవలు తప్పా నిర్వాహకులు ఎవరు కనబడడంలేదు. అంతే కాకుండా ఆనీరు ఎప్పుడు వడుతున్నారో... ఎప్పటి నుంచి ఉందో తెలియక ప్రజలు వినియోగించడానికి ఆసక్తి చూపడంలేదు. దీనికి తోడు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు దగ్గరలో జీవీఎంసీ చలివేంద్రాలు ఉండడం జీవీఎంసీ ఏర్పాటు చేసిన మంచినీటిని ఎవరూ ముట్టుకోవడంలేదు. ఈ పరిస్థితి చూసిన వారు అధికారులు లక్షలు పోసి ఏర్పాటు చేసిన కేంద్రాలు ఎందుకు పెట్టారో అర్థం కావడంలేదని ఆక్షేపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

గాజువాక జోన్‌పరిధిలో 42 చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలని సుమారు రూ.35 లక్షలు కేటాయించింది. అందుకు అనుగుణంగా టెండర్లు నిర్వహించడంతో ఆ కాంట్రాక్టు కూటమి నేతకు దక్కింది. దీనితో అధికారులు కూడా ఆనేతకు అనుకులంగా వ్యవహరిస్తూ నిర్వహణ ఏర్పాట్లను పట్టించుకోవడం మానేశారు. దీన్ని ఆసరాగా తీసుకొని తనకు నచ్చినచోట చలివేంద్రాలు ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటి నిర్వహణ తీరును చూస్తుంటే ప్రజాధనం వృథా తప్పా ఎవరి దాహార్తి తీర్చడానికి దోహదపడలేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు వాటిపై దృష్టి సారించి జన సంచారం అధికంగా ఉండే చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజాధనం వృథాకాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

దేశవ్యాప్త బంద్ విజయవంతానికి పిలుపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు.. జీవో 21 ఉపసంహరణ, ఆర్టీవో చలానాల తగ్గింపు, లేబర్ కోడ్స్ రద్దు వంటి వాటిని కోరుతూ ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు జరిగిన సమ్మెలకు, ఇప్పుడు జరుగుతున్న ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. 16 డిమాండ్లలో అన్నింటికన్నా ముఖ్యమైనది లేబర్ కోడ్లు రద్దు చేయడమన్నారు. లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులకు చట్టాలు వర్తించని (షెడ్యూల్, నాన్ షెడ్యూల్) కార్మికులందరూ బానిసత్వంలోకి నెట్టబడతారన్నారు. వీటితో పాటు ఆటో కార్మికులకు ఉరితాడు వంటి మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019ను రద్దు చేయాలని, పెంచిన చలానా చార్జీలు తగ్గించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ 11 కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న ఆటోబంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. కార్మికులు ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా నాయకులు రెడ్డి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పాల రేట్లు తగ్గించాలి

దాబాగార్డెన్స్: విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల ధర లీటరుకు రూ.2 పెంచేసిందని, ఈ నెల 10 నుంచి పెంచిన రేట్లు అమల్లోకి తీసుకొచ్చారని, ఈ పెంపును సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని భారీగా పెంచిన పాల రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏడాది కిందటే లీటర్ పాల ధర రూ.2 పెంచేసిందని, ఈ పెంపుదలను టీడీపీ, జనసేన, బీజేపీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే మరో రూ.2 లీటర్‌కి పెంచడం దుర్మార్గమన్నారు. పైపెచ్చు రైతులకు లీటర్ పాల సేకరణ ధరను రూ.3కి తగ్గించారని, ప్రస్తుతం రైతుల నుంచి సేకరించే లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు విశాఖ డెయిరీ అమ్మే ధరకు రూ.20 వ్యత్యాసం ఉందన్నారు. కానీ వినియోగదారులకు మాత్రం గత ఏడాది కాలంలో లీటర్ పాల ధర రెండు సార్లు రూ.2 చొప్పున రూ.4 పెంచడమంటే ప్రజలపై తీవ్ర భారం మోపడమేనన్నారు. ఈ పెంపుదల వల్ల ప్రజలపై రూ.6 కోట్ల భారం పడతుందని, నిత్యావసర సరుకులన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు నిత్యం పెంచుకుంటూ పోతున్నారని, విద్యా, వైద్య ఖర్చులు పెరిగిపోయాయన్నారు.